
ప్రజాశక్తి
శుక్రవారం 26 డిసెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'ప్రకాశం' ఎన్‌సిసి విద్యార్థికి
అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌సిసి విభాగానికి చెందిన విద్యార్థి పి. షంషుద్దీన్ ప్రతిష్టాత్మకమైన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి ఎన్‌సిసి శిబిరం లక్షద్వీప్‌లోని కవరత్తి ఐలాండ్‌లో ఈనెల 23 నుంచి 3 జనవరి 2026 వరకు జరగనుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ ఎన్‌నిసి కేడెట్లు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ క్యాంప్ ద్వారా జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఐక్యత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలు విద్యార్థుల్లో మరింత బలపడతాయని పేర్కొన్నారు.పి. షంషుద్దీన్ 34 ఎన్‌సిసి బెటాలియన్ ఒంగోలు పరిధిలో శిక్షణ పొందుతూఈ అరుదైన అవకాశాన్ని సాధించారని కళాశాల వర్గాలు వెల్లడించాయి. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ,కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ విద్యార్థి పి. షంషుద్దీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



షంషుద్దీన్

ప్రజా ఉద్యమ నేతపై
పీడీ కేసు నమోదు దారుణం



విఆర్‌సి సెంటర్‌లో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి నెల్లూరు

ప్రజా ఉద్యమ నేత, అనకాపల్లి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రైతు సంఘం నాయకులు ఎం.అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం అక్రమంగా పిడి కేసు బనాయించి అరెస్టు చేయడం దారుణం, దుర్మార్గమని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం అన్నారు.ప్రజా ఉద్యమ నాయకులు అప్పలరాజు పై అక్రమంగా పీడీ యాక్ట్ బనాయించి జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ నుండి విఆర్‌సి సెంటర్ వరకు నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్రమంగా బనాయించిన కేసును ఎత్తివేయాలని, బేషరతుగా అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని, కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్‌రావులు మాట్లాడారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలపై గొంతెత్తి ఉద్యమాలు నిర్వహించే ప్రజా ఉద్యమకారులపై పిడి యాక్టును ప్రయోగించడం తొలిసారిగా చూస్తున్నామన్నారు. అనకాపల్లిలో గిరిజనుల పక్షాన రైతులు వ్యవసాయ కార్మికుల పక్షాన నిలబడి కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న కామ్రేడ్ అప్పలరాజు పై అక్రమంగా పిడి యాక్ట్‌ను బనా యించారన్నారు. ఉత్తరాదిలో బుల్డోజర్ ప్రభుత్వంగా పేరుగాంచిన యోగి ఆదిత్యానాథ్ అరాచక పాలనను కూటమి ప్రభుత్వం కూడా ఆచరించడం గా కనపడు తుందన్నారు. ప్రశ్నించే గొంతుకులను అణగ దొక్కాలని ప్రయత్నిస్తే వేయి గొంతుకలై లేస్తాయని ఇది చరిత్ర చెప్పిన సత్యం అని కూటమి ప్రభుత్వానికి వారు హితవు పలికారు. అప్పలరాజుకు ఎదురైన పరిస్థితి నెల్లూరు ట్రంకు రోడ్డులో నిలబడి ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న ప్రతి ఒక్కరికీ ఎదురవుతుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని విడనాడాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడ ˘డంలో గంజాయి మూకల ఆట కట్టించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. గంజాయి మూకల చేతిలో అత్యంత కిరాతకంగా హత్యకు గురైన ప్రజా ఉద్యమకారుడు కామ్రేడ్ పెంచలయ్య హత్యపై నేటికీ ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర హోంశాఖా మంత్రి నోరు మెదపకపోవడం పరిస్థితికి నిదర్శనమని అన్నారు. భూములను, సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ఉద్యమ నాయకులను అధికారంతో అణగదొక్కాలని ప్రయత్నిస్తే మరింత రెట్టింపు వేగంతో ఉద్యమాలు ఉధతం అవుతాయని హెచ్చరించారు. తక్షణమే అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్‌ను ఎత్తివేయాలని బేషరతుగా జైలు నుండి ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పలరాజుకు మద్దతుగా భవిష్యత్తులో ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలి.వెంగయ్య, ఎం.పుల్లయ్య, తుళ్లూరు గోపాల్, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, శేషయ్య, టివివి ప్రసాద్, గడ్డం అంకయ్య, నాయకులు పులిగండ్ల శ్రీరాములు, అజీజ్, పి. సూర్య నారాయణ, ఐద్వా నాయకురాలు కత్తి పద్మ,కటికాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రమణ, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

అందరం కలిసి సిఎంతో మాట్లాడుతాం..

-గూడూరు, మూడు మండలాలు కలిపేందుకే ..
-టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

గూడూరు నియోజకవర్గం, మూడు మండలాలు కలిపే విషయంలో అందరం కలిసి సిఎంతో మాట్లాడుతామని టిడిపి జిలాల అధ్యక్షులు బీద రవిచంద్ర అన్నారు. గురువారం టీడీపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన బీద రవిచంద్ర యాదవ్, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. అబ్దుల్ అజీజ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున టిడిపి జిల్లా కార్యాలయం చేరుకున్నారు. గత మాలలు, పూల బొకేలు, బాణసంచాలతో కాల్చారు. రవిచంద్ర మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో గూడూరు ను కలపాలని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నారు. రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు కలిపే విషయంలోనూ ప్రజలు ఆందోళన చేస్తున్నారని, ఈ విషయాన్ని అందరం కలిసి సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. పార్టీ మంచి నిర్ణయం తీసుకుంటుందన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను ఇంటికెళ్లి రవిచంద్ర, వెంకటేశ్వర్లురెడ్డి కలిశారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ ,పాశం సునీల్ కుమార్ , మాజీ ఎమ్మెల్యే లు కంభం విజయ రామిరెడ్డి ,కొమ్మి లక్ష్మయ్య నాయుడు, నెలవల సుబ్రమణ్యం, వాటర్ బేస్ అథారిటీ ఛైర్మన్ జెడ్ శివప్రసాద్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణా రెడ్డి, ఎపి కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, తదితరులు ఇరువురికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, గజమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించాయి.



పార్టీ బాధ్యతలు తీసుకున్న బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలను అభినందిస్తున్న 'సోమిరెడ్డి'

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :

కందుకూరు డివి జన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జెడిబిఎం టౌన్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా గురువారం దాతలు జాహ్నవి చంద్రహాస్ సహాయంతో యాచకులకు రగ్గులు, పలావు ప్యాకెట్లు ,వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, కార్యదర్శి శీలం వెంకటేష్, సంఘకాపరి రెవ. గడ్డం జాన్, వంగెపురం జయకుమార్, చదల వాడ ఐజక్, జంగాల ప్రభు కుమార్, మద్దాళి రమేష్, జంగాల మాణిక్యాంబ, చదలవాడ స్వర్ణలత, మద్దాళి అరుణ, జంగాల వనజ కుమారి, పట్టపు ప్రభు చరణ్, పట్టపు శారమ్మ, శీలం కోటేశ్వరి, శీలం అరుణ ఉన్నారు.



టిడిపి పార్లమెంటరీ కమిటీలో
పలువురికి చోటు

ప్రజాశక్తి-కందుకూరు :

టిడిపి నెల్లూరు పార్లమెంటరీ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులుగా కందుకూరుకు చెందిన సీనియర్ నాయకుడు ఉన్నం వీరాస్వామిని నియ మించారు. ఆయనతోపాటు కందు కూరు నియోజక వర్గానికి చెందిన మరి కొంతమంది నాయ కులను కమిటీలో నియమించారు. అధికార ప్రతినిధిగా చదలవాడ కొండయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దసాని మహేంద్ర, షేక్ మహబూబ్ బాషా (రూబి), కార్యదర్శిగా దార్ల ఎలమందమ్మ కమిటీలో నియమించబడ్డారు.



టిడిపి పార్లమెంటరీ కమిటీ సభ్యులు

ప్రజాభిప్రాయాన్ని
పరిగణలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణఖు వ్యతిరేకంగా కోటి సంతకాలు చేసిన ప్రజలపై సిఎం చంద్రబాబు కక్ష పెంచుకున్నాడని, ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం లెక్కచేయడం లేదని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. గురువారం బైకాస్ రోడ్డులోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ అభిప్రాయాన్ని తెలియజేయడంతో ప్రయివేట్ సంస్థలు ప్రజా వ్యతిరేకతను గుర్తించి ముందుకు రావడం లేదని ఆయన వివరించారు. పభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయళ్లు అరెస్ట్

ప్రజాశక్తి- సైదాపురం : మండలంలోని పరిధిలోని పెరుమాళ్లపాడు గ్రామంలో కోడి పందెంరా యుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో గురువారం సైదాపురం ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేశారు. పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక కోడిపుంజు రూ. 3వేలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇరిగేషన్ అవినీతిపై విచారణ జరపాల్సిందే..

వైసిపి నేత కాకాణి డిమాండ్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ అవినీతిపై విచారణ జరపాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మనుబోలు మండలం కేంద్రంలో పర్యటించారు. సర్వేపల్లిలో ఇరిగేషన్ పనులలో జరిగిన అవినీతిపై, కూటమి ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే విచారణ జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే వివిధ పద్దులలో మంజూరైన పనులను మరలా మొన్న మొంథా తుపాన్ పేరిట మంజూరు చేశారంటూ ఆధారాలతో సహ సోమిరెడ్డి అవినీని బయటపెట్టారు. సర్వేపల్లిలో జరిగిన ఇరిగేషన్ అవినీతిపై రైతుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సోమిరెడ్డికి సవాల్ విసిరారు. సోమిరెడ్డి షట్టర్ పనుల కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి, డబ్బులు గుంజేందుకు ఆడుతున్న డ్రామాలను ఆడుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో గ్రామాలలో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామాలలో సాగు, తాగునీటి వసతి, సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు లాంటి ప్రజలకు అవసరమైన అన్ని వసతులను కల్పించామన్నారు. తన అవినీతి బయటపడుతుందని దొంగే.. దొంగ అన్నట్లుగా సోమిరెడ్డి వ్యవహార శైలి ఉందన్నారు. గ్రామాలలో సోమిరెడ్డి రైతులను అడ్డుపెట్టుకొని చేసిన అవినీతి తెలిస్తే, గ్రామాలలో రానివ్వకుండా రైతులు తరిమికొడతారన్నారు. సోమిరెడ్డి గతంలో నీరు చెట్టు పథకంలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్న పంథాను నేటికి కొనసాగిస్తున్నారు. మొంథా తుఫానులో దెబ్బతిన్న కాలువల చెరువుల మరమ్మత్తులకు జిల్లాలోని 11 నియోజకవర్గాలకు రూ 97 కోట్లలో సర్వేపల్లి నియోజకవర్గానికి రూ 17 కోట్ల రూపాయలు జిల్లా కలెక్టర్ గారు మంజూరు చేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 316 ఇరిగేషన్ పనులు ఎక్కడ చేశారో సోమిరెడ్డి రైతులకు చూపాలన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చేసిన పనులకు కూటమి ప్రభుత్వంలో వివిధ పద్దులలో సోమిరెడ్డి బిల్లులు చేసుకుంటున్నారని విమర్శించారు.



మనుబోలులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి



విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు

అంకమ్మ తల్లి ఆలయ అనివేటి మండప నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గురువారం కీర్తిశేషులు కల్లూరి వెంకటేశ్వర్లు ధర్మపత్ని లక్ష్మమ్మ కుమారుడు విజయ్ కుమార్ ధర్మపత్ని మమత రూ 51,116లు, చీదెళ్ల వెంకటేశ్వర్లు ధర్మపత్ని కష్ణకుమారి, చీదెళ్ల సుబ్బయ్య ధర్మపత్ని ప్రభావతి రూ 25,116లు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురళీమోహన్ కు అందజేశారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సండేమార్కెట్ 2026 క్యాలండర్‌ను గురువారం నెల్లూరు టౌన్ హాల్ రీడింగ్ రూంలో తెలుగు భాషోద్యమ సమితి నాయకులు చలంచర్ల భాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. క్యాలండర్ మంచి సందేశం ఇచ్చిందన్నారు. పుస్తకం గొప్పతనాన్ని వాటిని చదవాల్సిన అవశ్య కతను తెలిపిందన్నారు. సభకు అరసం అధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్ అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి నాయకులు ఈతకోట సుబ్బారావు క్యాలండర్ ను పరిచయం చేశారు. నెల్లూరు చరిత్రలో సండే మార్కెట్ క్యాలండర్ కు ప్రత్యేకత ఉందని , ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క ఇతివృత్తంతో 16 సంవత్సరాలు నుండి గోడ క్యాలండర్లు తీసుకొస్తున్నామన్నారు.కార్యక్రమంలో జి.మాల్యాద్రి, నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షులు ఎ. జయ ప్రకాష్, పెన్నా రచయితల సంఘం (పెరసం) అవ్వారు శ్రీధరబాబు, మరో గ్రంథాలయ ఉద్యమకారుడు మంచికంటి, బాల భవన్ డైరెక్టర్ జి. సుభద్రా దేవి వక్తలు గా పాల్గొన్నారు. సండే మార్కెట్ కమిటీ అధ్యక్షులు హాఫీజుద్దీన్ శరవణన్, ఆర్ సెంథిల్ కుమార్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు పి. కొండమ్మ, నాయకులు పి. యానాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



గుడ్లూరులో..



తోటపల్లి గూడూరులో..

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు మండలంలో గురువారం క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. ఇస్కపాలెం సెంటర్‌లో క్రైస్తవ ఆరాధన మందిరంలో ఫెలోషిప్ చర్చ్ ఆ ఫ్ గాడ్ సంస్థల చైర్మన్, పాస్టర్ కుందవరం బాబీ ఇమ్మా నుయేల్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. పాస్టర్ బాబీ ఇ మ్మానుయేల్ సందేశమిచ్చారు.

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : క్రి స్మ స్ పండగు సందర్భంగా గురువారం ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సంతపేటలోని చరిచలో, వెంకటేశ్వరపురంలోని హోసన్న ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

గుడ్లూరు :మండల కేంద్రం గుడ్లూరులో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఎస్ఆర్ గిరిజన కాలనీలో ఉన్న సార్వత్రిక కడబోర చర్చిలో పాస్టర్ జీవన్ బాబు ఆధ్వర్యంలో ఏసుప్రభు ప్రార్థనలు జరిగాయి. గ్రామ పెద్దలు వాడి వేణుగోపాల్ సాదినేని హరిబాబు ఏసుబాబు వారి అధ్వర్యంలో వద్దులకు వితంతు మహిళలకి ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు.అనంతరం అన్నదానం చేశారు. గిరిజనుల తోటి గ్రామ పెద్దలు పాల్గొని ఘనంగా వేడుకలు నిర్వహించారు.



నెల్లూరులో..



ప్రారంభోత్సవంలో
ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్

లగ్జరీ సూట్ రూమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి- కందుకూరు

కందుకూరు పట్టణంలో ఉప్పుటూరి శ్రీను కాంప్లెక్స్ ఎదుట ఎస్‌బిఐపైన విప్పగుంట నాగరాజు, పి. మహేందర్ నూతనంగా ఏర్పాటు చేసిన ది గ్రాండ్ నోవాటెల్ లగ్జరీ సూట్ రూమ్స్‌ను కందుకూరు డిఎస్‌పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. డిఎస్‌సితోపాటు మాజీ ఎంయల్‌సి కంచర్ల శ్రీకాంత్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసులు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు వడ్లమూడి సురేష్, ఏపీ విద్యాశాఖ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు,హరిణి ప్రజా వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు,ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డా"చక్కా వెంకట కేశవరావు, ఎం కే యాదవ్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. డిఎస్‌పి మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో అన్నీ వసతులతో ది గ్రాండ్ నోవాటెల్ లగ్జరీ సూట్ రూమ్‌లు చాలా చక్కాగా ఉన్నాయన్నారు. అనంతరం డిఎస్‌పిని సన్మానించారు. టిడిపి నాయకులు చిరంజీవి రెడ్డి ఉన్నారు.

బాధిత బాలికలకు మంత్రి ఆనం పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఇటీవల ఆత్మకూరులో నెల్లూరుపాలెం - జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం దుర్ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు ఆడబిడ్డలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. గురువారం ఆత్మకూరు రూరల్ మండలం బోయిలచిరివెళ్ళ గ్రామంలోని టిడిపి కుటుంబ సభ్యులు చావల మాధవ - మనోజ చిత్రపటాలకు మంత్రి ఆనం నివాళు లర్పించారు. వారి కుమార్తెలు మనస్విని, లక్ష్మీ తేజస్వినిని దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వారిని ఓదార్చి.. తల్లిదండ్రులు లేని లోటు ఎవరు తీర్చలేనిదని, ఈ దుర్ఘటన అందరినీ కలచివేసిందని మంత్రి తన బాధను వ్యక్తం చేశారు. ఆడబిడ్డల భవిష్యత్తుకు తాను అండగా ఉంటానని, ఈ ప్రాంత ప్రతినిధిగా వారి బాధ్యతను తీసుకుంటున్నట్లు మంత్రి ప్రకటించారు. మనస్విని (ఇంటర్ ద్వితీయ సంవత్సరం), లక్ష్మీ తేజస్విని (9వ తరగతి) విద్యాభ్యాసానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. వారికి ఉన్న మూడు ఎకరాల భూములను కూడా రెవిన్యూ సమస్యలను తొలగించి ఇద్దరికీ చెరిసగం భూములకు పట్టాలు



బాధిత బాలికలతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

తయారు చేయించి ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా నూతన ఇంటిని మంజూరు చేయించి అధికారుల ద్వారానే ఆ ఇంటిని పూర్తి చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. చనిపోయిన వారిద్దరూ తమ పార్టీ క్రియాశీలక సభ్యులైనందున పార్టీ తరపున ఇన్సూరెన్స్ మొత్తాన్ని కూడా నారా లోకేష్ బాబుతో మాట్లాడి ఇప్పిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి కూడా ఇద్దరు ఆడపిల్లలకు మరింత ఆర్థికసాయం చేస్తామని మంత్రి ప్రకటించారు. తల్లిదండ్రులు కోల్పోయిన బిడ్డలను ఆ ఇంటి పెద్దదిక్కులా స్వయంగా మంత్రి వచ్చి పరామర్శించి, ఆ ఆడబిడ్డల భవిష్యత్తుకు ధైర్యం చెప్పిన తీరు ప్రతి ఒక్కరిని కదిలించింది. ప్రమాదం జరిగిన రోజు ఆత్మకూరులోనే ఉన్న మంత్రి నేరుగా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి వెళ్లి సంఘటనను తెలుసుకొని పరామర్శించారు. అంతటితో మరచిపోకుండా మానవతావాదిగా.. నేడు స్వయంగా వారింటికి వచ్చి ఆ బిడ్డలకు తాను, తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆ బిడ్డలకు ఏం కష్టం వచ్చినా తాను ఉంటాననే నమ్మకాన్ని భరోసాను కల్పించారు. మండలంలోని రావులకొల్లు గ్రామంలో పెద్దలు రామిరెడ్డి, పెద్ద మస్తాన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం వారి ఉత్తరక్రియల కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కేత విజయభాస్కర్ రెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ మృతి



ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరికి చెందిన ప్రముఖ వ్యక్తి, రిటైర్డ్ టీచర్ షేక్.మహమ్మద్ హనీఫ్ ఖలీది (78) బుధవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందగా గురువారం అంత్యక్రియలు ఘనంగా జరిపి షబ్బీర్ కాలనీ సమీపంలోని ఖబరస్తాన్ నందు ఖననం చేశారు. గత కొంతకాలంగా ఆయన దయాబెటిస్ వ్యాధిలతో అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి హఠాత్తుగా ఆరోగ్యం క్షీణించటంతో ఉదయగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడే మృతి చెందారు. ఆయన మృతితో వందలాది మంది శిష్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. నాలుగు దశాబ్దాలపాటు ఆయన ఉర్దూ ఉపాధ్యాయుడుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా, ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఆయన జీవితాంతం ఉర్దూ భాష అభివృద్ధికి ఎనలేని సేవలందించారు. ఉదయగిరిలో అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థను స్థాపించి కొన్ని దశాబ్దాల పాటు ప్రధాన హోదాలో బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలో ఉర్దూ పాఠశాలల స్థాపనకు, ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టుల మంజూరుకు, వాటి భర్తీకి కృషి చేశారు. ఉర్దూ ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేందుకు ఎందరో పేద యువకులకు తోడ్పడ్డారు. ఉర్దూ ఉపాధ్యాయుల ఉన్నతికి అహర్నిశలు కృషి చేశారు. అనేకమంది పేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఆర్థికంగా సహాయపడి చదివించారు. హనీఫ్ ఉర్దూ రచయితగా, ఆధ్యాత్మిక గురువుగా వందలాదిమంది శిష్యులను తీర్చిదిద్దారు. ఆయన ఉర్దూ భాషా సాహిత్యాభిమాని, అనేక ముషాయిరాలు సాహిత్య గోష్ఠులు ఉదయగిరిలో నిర్వహించి రాష్ట్రంలోని ఉర్దూ కవులను ఉదయగిరికి రప్పించారు. ఉర్దూభాష గొప్పతనాన్ని ఉదయగిరి ప్రాంత ప్రజలకు తెలియజేశారు. ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వంచే ఆయన అనేక అవార్డులు, ప్రశంసలు పొందారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ పదవుల్లోకి తనవంతు సేవలందించారు. ఇటీవల ఆయన రాష్ట్ర ప్రభుత్వ జీవనసాఫల్య అవార్డును పొందారు. ఆయన ఎంతో శ్రమించి రచించిన 'ఉదయగిరి మహనీయులు' పుస్తకం విడుదలకు సిద్ధంగా ఉన్న తరుణంలో మృతి చెందడం అందరినీ కలచి వేసింది. ఆయన మృతి ఉదయగిరి ప్రాంత ప్రజలకు తీరనిలోటుగా పలువురు పట్టణ ప్రముఖులు ద్విగ్భాంతి వ్యక్తపరిచారు. పలు ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆయన మృతిపై సంతాపం తెలియజేశాయి.

నేడు వంగవీటి రంగా వర్ధంతి

ప్రజాశక్తి - కావలి : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం కుల, మత, ప్రాంతాలకతీతంగా జీవితాంతం పోరాటం చేసిన మహనేత వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వంగవీటి రంగా విగ్రహ కమిటీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు కావలి రైతు బజార్ సెంటర్‌లో ఉన్న రంగా కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరై, పుష్పాంజలి ఘటించనున్నారని తెలిపారు. రంగాఅభిమానులు నేటి యువతకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో కుల, మత ప్రాంతాలకతీతంగా రంగా అభిమానులు పెద్దఎత్తున పాల్గొని నివాళులర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామసభ వాయిదా

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మార్పు చేసి, విబి జి రాంజీ పథకముపై 26వ తేదీ జరగాల్సిన గ్రామ సభలలో అవగాహన కార్యక్రమం తాత్కాలికంగా నిలుపుదల చేశామని ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. మళ్లీ గ్రామసభలు ఎప్పుడు నిర్వహించేది రానున్న రోజుల్లో తదుపరి నిర్ణయిస్తామని తెలియజేశారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం


ప్రజాశక్తి-బిట్రగుంట



బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో రిటైర్డ్ తహశీల్దార్ దాసరి ఏసురాజ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు దాసరి రాజేష్ భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీవుల్లా మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా తమ స్నేహితుడు దాసరి రాజేష్ గతంలో కూడా చాలా సేవా కార్యక్రమాలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ దాసరి రాజేష్ వారి కుటుంబ సభ్యులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటామని తెలిపారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి మాట్లాడుతూ ఇంటి కుటుంబ సభ్యుల మధ్య జరుపుకునే పండుగను అనాథల మధ్య ఆదరణ కేంద్రంలో జరుపుకోవడం ఆయన మంచి మనసుకు నిదర్శనమని ఆయన మరెన్నో పుట్టినరోజు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బిఎంఆర్ యువసేన ఉపాధ్యక్షుడు డబ్బేరు శ్రీధర్, దాసరి రాజేష్ కుటుంబ కుటుంబ సభ్యులు, బిఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-వరికుంటపాడు :



రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

మండల పరిధిలోని పాములూరు పల్లి పంచాయతీలోని తొడుగుపల్లి గ్రామంలో శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశానుసారం టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు సర్పంచ్ తెల్లగొర్ల సుశీల టిడిపి నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య సూచనలతో రూ.5లక్షలతో 138అడుగులు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం చేపట్టిందని గ్రామ సీమల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్కల నాగేశ్వరరావు, మాదినేని వెంగళరావు, ధనెంకుల నాగేంద్ర, నక్కల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

వరిలో పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-మర్రిపాడు : నారుమడిలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం, పిలకల దశలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం లేదా 5శాతం చనిపోయిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 30-35 మగ రెక్కల పురుగులు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలని కె వి కె సేద్య విభాగం శాస్త్ర వేత్త డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నారు పీకటానికి వారం రోజులు ముందు 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3శాతం సి.జి. గుళికలను ఇసుకలో కలిపి మడిలో పలుచగా నీరుంచి చల్లి ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలన్నారు. నాటే సమయంలో నారు కట్టల చివరలను త్రుంచాలన్నారు. పిలక లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3శాతం సి.జి. గుళికలు ఎకరానికి 10 కిలోలు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి. 1.5 గ్రా. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. చిరుపొట్ట దశ నుండి పూత దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4శాతం గుళికలు 4 కిలోలు వేయాలని లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి. 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

జెడ్డా మస్తానయ్య వర్ధంతి

ప్రజాశక్తి-కొడవలూరు



మండలంలోని యల్లాయపాలెం గ్రామంలో సిపిఎం జిల్లా నాయకులు జెడ్డా మస్తానయ్య 4వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన స్మారక స్థూపం వద్ద మస్తానయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళ పుల్లయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, గండవరపు శేషయ్య, తిరకాల దయాకర్, నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, గోనె దయాకర్, భూలోకం కాంతారావు, పెద్దబ్బయ్య, సిఐటియు నాయకులు నరసింహ, తదితర నాయకులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల కుటుంబసభ్యులను కోల్పోయిన టిడిపి నాయకుల కుటుంబాలను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాతృమూర్తి తుమ్మల లక్ష్మమ్మ మృతి చెందడతో చంద్రారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన ఆత్మకూరు మాజీ మండల ఉపాధ్యక్షుడు కూరగాయల శీనయ్య (నలిశెట్టి శ్రీనివాసులు) వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆనం కుటుంబానికి ఎంతో నమ్మకస్తుడిగా, ఆత్మీయుడిగా మెలిగిన వ్యక్తి నలిశెట్టి శీనయ్య అకాల మరణంపై మంత్రి ఆనం విచారం తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఆత్మకూరులోని వారి నివాసం వద్ద చిత్ర పటానికి పుష్ప మాలతో నివాళి అర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాల తాము అండగా ఉంటామన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, యువనాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తోట సుబ్బారావు తదితరులున్నారు.



పిల్లలకు ఆహారం అందజేస్తున్న దృశ్యం

పేద పిల్లలకు భోజనం అందజేత

ప్రజాశక్తి - కావలి

కావలి పట్టణం నివాసులు వడ్డి. వెంకటేష్ - సంతోషం (లేట్) దంపతుల మనవడు, వృత్తి రీత్యా హైదరాబాద్లో నివాసం ఉంటున్న వారి కుమారుడు కోడలు వడ్డి.చైతన్య సిఇఒ (సీపీ కార్ప్) - సురేఖ దంపతుల కుమారుడు వడ్డి.భవిన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో చదువు కుంటున్న పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పేద విద్యార్థుల మధ్య కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దాత వడ్డి.వెకటేష్, వడ్డి. విక్రమ్, స్రవంతి, వసంత, పృథ్వీ, స్వాతి, వారి కుటుంబ సభ్యులు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ కార్యాలయంలోని పిల్లల మధ్య మనవడు పుట్టినరోజును ఘనంగా నిర్వహించిన దాత వడ్డి వెంకటేష్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. పుట్టినరోజు జరుపుకుంటున్న వడ్డి.భవిన్‌కు సంయుక్త సేవాసంస్థ ద్వారాహదయ పూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నామన్నారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా గత 6 సంవత్సరాల నుండి పేదలకు అన్నదానం, సంయుక్త సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రానికి కుట్టు మిషన్ కూడా అందజేసిన దాతృత్వం చాటుకున్నారని తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే అద్భుతమైన అవకాశాలు

ప్రజాశక్తి - కావలి

కావలి పట్టణంలోని డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాలలో 8వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్ షూటింగ్ బాల్ పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారుల కవాతు అనంతరం క్రీడాకారుల నృత్యాలు అతిథుల ప్రసంగాలతో అత్యంత వైభవంగా పోటీలు ప్రారంభమయ్యాయి. 18జిల్లాల నుంచి హాజరైన షూటింగ్ బాల్ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పాండురంగా రావు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, షూటింగ్ బాల్ క్రీడ రాష్ట్రంలో రోజురోజుకి ఎంతో అభివృద్ధి చెందుతుందని, క్రీడను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను, క్రీడాప్రేమికులను అభినందించాల్సిన విషయమని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమేష్ బాబు, ప్రిన్సిపల్ టి.వి. రావు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తమ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత కల్పిస్తామని తమ కళాశాలలో ఇప్పుడు ఈ పోటీలు నిర్వహించాలన్న తాము ముందుంటామని తెలిపారు. రాష్ట్రఅధ్యక్షుడు



జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పాండురంగారావు

రమణయ్య మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడల వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు మాట్లాడుతూ అత్యంత క్రీడా ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాష్ట్ర జట్టుగా ఎంపిక చేసి మహారాష్ట్రలో జనవరిలో జరగబోయే 44వ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కిరణ్ కుమార్, జయరావు, నాగరాజు, విజయ్‌కుమార్, నరేష్‌బాబు, వేణుగోపాల్, గణేష్, పోటీల నిర్వాహకుడు మురళి, టెక్నికల్ డిపార్ట్మెంట్ హరి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని యథాతథంగా కొనసాగించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంను పనులను పాత విధానంతో యథాతథంగా కొనసాగించాలని సిపిఎం, రైతుసంఘం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బిజ్జంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో స్థానిక గ్రామస్తులతో ఆందోళన చేపట్టారు. అనంతరం సిపిఎం, రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఉపాధి హామీని నీరుగార్చే జిఒను వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. కోట్లాదిమంది ప్రజలకు ఉపాధి చూపించే ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్నారు. ఈ జిఒతో ఉపాధి పనే జీవనాధారంగా ఉండే కుటుంబాలకు కుటుంబ జీవనాధారం దూరమవుతుందన్నారు. పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన అమాయక ప్రజలకు నూతనంగా తీసుకొచ్చిన కెసిఆర్‌తో జాబ్‌కార్డ్ తొలగింపుతో వారికి తీవ్రఅన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సొంతింటి కల కోసం ఇళ్లు కటించుకోవడానికి ఉపాధి జాబ్ కార్డును ప్రథమం చేశారని తొలగించిన వారు ఇళ్లు నిర్మాణం కోసం తప్పని తిప్పలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం వారికి శాపంగా మారాయన్నారు. ఈ విషయాలను గుర్తించి పాతవిధానాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

భూముల ఆక్రమణపై చర్యలు

ప్రజాశక్తి-ముత్తుకూరు

భూముల ఆక్రమణపై రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని కృష్ణపట్నం గ్రామం కరణాల వీధికి చెందిన కుటుంబాలకు ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హామీనిచ్చారు. సర్వేనెంబర్ 756లో ఈ కుటుంబాలకు సంబంధించిన సాగు భూమిని ఇతరులు ఆక్రమించి ఆక్వాగుంటలు చేస్తున్న విషయంపై గురువారం నెల్లూరులోని ఎంఎల్ఎ నివాసంలో తెలియజేశారు. తప్పనిసరిగా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎంఎల్ఎ భరోసా కల్పించినట్లు కరణాల వీధి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పిడి యాక్ట్‌పై అరెస్టు దారుణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



అనకాపల్లి జిల్లా రైతుసంఘం కార్యదర్శి అప్పలరాజు మీద పిడి యాక్ట్ ప్రయోగించి విశాఖపట్నం జైలుకు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూ మాఫియా గంజాయి విక్రయాలు అనేక నేరాలు ఘోరాలు చేసే వారిపై ప్రయోగించాల్సిన పిడి యాక్ట్‌ను రైతాంగం కోసం ఉద్యమిస్తున్న శ్రమించే రైతు నాయకులు బనాయించడం అత్యంత దారుణమని పిడి యాక్ట్‌ను ఉపసంహరించుకొని అప్పలరాజును విడుదల చేయాలని, అలాచేయని పక్షంలో ఎపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించిన విధంగా రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని సమీకరించుకొని రైతునాయకునికి మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని నెల్లూరు జిల్లా రైతుసంఘం తరపున ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.



బీద రవిచంద్రకు మంత్రి ఆనం అభినందన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరు పార్లమెంట్ జిల్లా టిడిపి నూతన అధ్యక్షులుగా నియమించబడిన శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డిలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందనలు తెలియజేశారు. గురువారం నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీదా రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలను మంత్రి అభినందించారు.



మేయర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మేయర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కోవూరు

నెల్లూరు నగర మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్‌ను కోవూరు మండల టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పాల్గొన్నవారిలో కోవూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెంబెటి పెంచలయ్య, చెంబేటి చిన్నయ్య, బాలరవి, ముసలి సుధాకర్, నాటకరాణి వెంకట్, పుత్తేటి రవిచంద్ర తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సంగం

సంగంలో బలిజ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పోకల రవికుమార్, ప్రధాన కార్యదర్శి కమతం సుబ్బారావు బలిజ కులస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నెల్లూరులో జనవరి 4వ తేదీన బలిజ విద్యార్థులను సన్మానించి ఆర్థిక పురస్కారాలను అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పోకల రవికుమార్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని ఇరుకళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయం సమీపంలో ఉన్న బలిజ కాపు భవన్‌లో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం విశిష్ట అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రతిభా పురస్కారాలకు 10వ తరగతిలో 575 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 970 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామని తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి, వారి ఉన్నత చదువులకు చిన్నపాటి తోడ్పాటు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ సేవా ఫౌండేషన్ సభ్యులు చలపతి,తోట భాస్కర్, సురేంద్ర, సుధాకర్, మధుసూదన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలవ్యాప్తంగా గురువారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి యేసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించగా, ప్రభువును స్మరిస్తూ మహిళలు దైవ భక్తి గీతాలను ఆలపించారు. కేక్ కట్ చేసి అందరికి పంచారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : క్రిస్మస్ వేడుకలు సందర్భంగా శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మండలంలోని అన్ని చర్చలకు స్వీట్ బాక్సులు, కేకులు పంపిణీ చేసినట్లు టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపర్ల ఆధ్వర్యంలో రెవరెండ్ పాస్టర్ సమక్షంలో మండల టిడిపి నాయకులతో క్రిస్మస్ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. అనంతరం సంఘ కాపరులు పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మరెన్నో ఉన్నత పదవులను అవరోధించాలని ఏసుప్రభు ఆశీస్సులు ఉంటాయని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ శాసనసభ్యులు కాకర్ల సురేష్ వేడుకలను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ప్రతియేటా కేకులు స్వీట్ బాక్సను పంపిణీ చేస్తున్నారని ఆయన ప్రతిఒక్కరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొజ్జ నరసింహులు, నరసింహ, సుబ్బారెడ్డి, పెద్ద వెంకటయ్య, చర్చి నిర్వాహకులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-అల్లూరు : మండలంలో క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో అందంగా అలంకరించారు. బుధవారం రాత్రి నుంచి మిడ్‌నైట్ వరకు ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, పెద్ద సంఖ్యలో సోదరులు పాల్గొని ప్రభువు యేసుక్రీస్తు జన్మదినాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనా సభలు కొనసాగాయి. చిన్నారులు సాంటా క్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.



వరికుంటపాడులో..

పాస్టర్‌లకు క్రిస్మస్ కానుక

ప్రజాశక్తి-వరికుంటపాడు : పాస్టర్లకు క్రిస్మస్ కానుక అందజేస్తానని చెప్పిన 48గంటల్లోనే అమలుపరిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, జెడ్‌పిటిసి రావిళ్ళ నాగేంద్ర, మండల యూనిట్ ఇన్‌ఛార్జి నాదెండ్ల రాజేంద్ర అన్నారు. మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి ఎస్‌సి కాలనీలోని చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాసనసభ్యులు కాకర్ల సురేష్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలోని క్రిస్టియన్ సోదరులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రిస్మస్ కానుకగా ఒక్కో పాస్టర్‌కు నెలకు రూ.5వేలు చొప్పున 12 నెలలకు రూ.60వేల నగదును వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8418 మంది పాస్టర్లకు రూ.50.50 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అరికొండ వెంకటరత్నం, అడుసుమల్లి రమేష్ బాబు, పిచ్చయ్య, చంగయ్య, మాధవ, భాస్కర్, రమణయ్య, క్రిస్టియన్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల్లో ఆక్వా గుంతలు

- రాత్రి పగలు తేడా లేకుండా నిర్భయంగా పనులు

ప్రజాశక్తి-ముత్తుకూరు

కృష్ణపట్నం కేంద్రంగా ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ ఆక్రమణలు ఏ స్థాయికి చేరాయంటే చివరకు సముద్రం తీరం గట్టు వరకు చేరుకున్నాయి. పేదోళ్ల మధ్య పెద్దవాళ్లు తొరబడి ఈ భూముల్లో ప్రవేశించి ఆక్వా సాగు చేసేందుకు పెద్దపెద్ద గుంతలు చేస్తున్నారు. సర్వే నెంబర్ 756లోని వివిధ విభాగాల నెంబర్లలో యంత్రాలు పని చేస్తున్నాయి. సుమారు 13 యంత్రాలు (హిటాచి 200 మిషన్లు) పనిచేస్తున్నాయి. ఇప్పటికే 50 ఎకరాల్లో అక్రమంగా గుంతలు ఏర్పాటయ్యాయి. ఈ భూముల్లో స్థానికులు వ్యవసాయ పంటలు వేసుకునేవారు. ప్రస్తుతం బడా బాబులు ఈ భూములపై కన్నేసి లీజు ప్రాతిపదికన ఎకరాకు రూ.30వేలు చెల్లిస్తూ భూములు స్వాధీనం చేసుకొని దర్జాగా ఆక్రమించి ఆక్వాగుంటలు చేసుకున్నారు. దాదాపు 100 అడుగుల ఎత్తులో కట్టలు పోశారు. ఆక్వా గుంటల కట్టలపైన పెద్దపెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా చేసుకున్నారు. గత నాలుగు రోజులుగా ఇంత జరుగుతున్నా కూడా ఆలస్యంగా రెవెన్యూ అధికారులు నిద్రలేచి రెండు రోజుల క్రితం పనులు నిలుపుదల చేసినప్పటికీ యథాతథంగా చేస్తున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో అక్రమార్కులు పనులు మరింతగా వేగవంతం చేసుకున్నారు. సముద్రపు ఒడ్డు నుంచి 500 మీటర్ల వరకు సిఆర్‌జెడ్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ కూడా నిబంధనలు తొంగులో తొక్కి గుంతలు చేసేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ ఆక్వా గుంతలకు అనువుగా చేసుకుంటున్న అక్రమార్కులపై రెవెన్యూ శాఖ చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కోడిపందేల స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-దగదర్తి

మండల పరిధిలోని కామినేనిపాళెంలో గుట్టుచప్పుడు కాకుండా గత కొన్నిరోజులు నుంచి అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. గురువారం ఈ విషయం తెలవడంతో వెంటనే సంఘటన స్థలానికి ఎస్ఐ జంపానికుమార్ చేరుకుని కోడిపందేలు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుడి వద్ద నుంచి ఒక కోడిని, రూ.1120 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.